క్లుప్తంగా

3న కుమ్మర శాలివాహన కార్తిక వన సమారాధన

అంబాజీపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 3న మాచవరంలో ఉన్న కుమ్మర శాలివాహన సంఘ భవనంలో నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మానేపల్లి వీరబ్రహ్మం, దాలిపర్తి భీమేశ్వరరావు, అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి తెలిపారు. ఈ వన సమారాధనలో ఇంటర్, టెన్త్ పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు బహుమతులు ఇవ్వనున్నామన్నారు. చిన్నపిల్లలతో నృత్యాలు, పాటల పోటీలు, కుర్చీ పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ వన సమారాధనకు కుమ్మర, శాలివాహనులంతా పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఉచిత కుట్టు శిక్షణ



మామిడికుదురులో ఉచిత కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు

మామిడికుదురు: గెయిల్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నారు. మామిడికుదురు బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలో ఈ నెల 24న ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఇక్కడ 45 రోజుల పాటు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తారు. ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచులుగా 54 మందికి శిక్షణ ఇస్తున్నారు. పి.గన్నవరం నియోజకవర్గానికి చెందిన 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన మహిళలకు ఇక్కడ ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంత మహిళల జీవన ప్రమాణాలను పెంపొందించే దిశగా ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బోయి భీమన్న మానవ వనరుల అభివృద్ధి కేంద్రం వేదికగా ఇప్పటికే నిరుద్యోగులకు గెయిల్ ఆధ్వర్యంలో ఉపాధి కోర్సులపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రముఖ కంపెనీల్లో సైతం ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. అదే తరహాలో మహిళలకు కూడా ఇతోధికంగా సహకారం అందించాలన్న దృక్పథంతో గెయిల్ ఉచిత కుట్టు శిక్షణను ఏర్పాటు చేసింది.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన



కొత్తపేట డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి

కొత్తపేట: హెచ్ఐవీ ఎయిడ్స్‌పై స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, జువాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి అధ్యక్షతన జరిగిన సదస్సులో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ ఎం.దుర్గాప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ వైరస్ లక్షణాలు, వాటి నివారణ మార్గాలు, ఎయిడ్స్ నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డీసీఎస్ పాపారావు, జువాలజీ హెచ్ఓడీ బి.విజయకుమార్, ఐకేసీ కోఆర్డినేటర్ కె.అంకమరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మలికిపురం: మండలంలోని గొల్లపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ ఏఈ మద్దూరి సతీష్ బుధవారం తెలిపారు. కరవాక, గొల్లపాలెం, గూడపల్లి, కేశనపల్లి గ్రామాల 11 కేవీ కొత్త ఫీడర్ బైఫర్కేషన్‌లో భాగంగా ఈ అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

నేడు మండల పరిషత్ సమావేశం

పి.గన్నవరం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఉదయం ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎం.భారతి తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

వైద్యానికి సాయం అందజేత



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: పెరాలసిస్ కారణంగా కాళ్లు చచ్చుబడిన బాధితుడికి వైద్య చికిత్సకు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.11 వేల సాయం బుధవారం అందజేశారు. పి.గన్నవరం మండలం ఊడుమూడి గ్రామానికి చెందిన చదలవాడ పెద వెంకన్నయ్యకి మూడేళ్ల క్రితం పెరాలసిస్ వచ్చి కాళ్లు, చేతులు, నడుము చచ్చుబడిపోయాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో వైద్య చికిత్స కోసం సాయం చేయాలని స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను కోరగా అతనికి రూ.11 వేల నగదు సాయాన్ని సభ్యులు అందజేశారు.

గోదావరీ

- కలవర పెడుతున్న కోత
- నదిలో కూలుతున్న కొబ్బరి చెట్లు
- ఆందోళనలో రైతాంగం



బి.దొడ్డవరంలో వైనతేయ గోదావరి నదిలో కూలిన కొబ్బరి చెట్లు

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీ తీరంలోని లంక గ్రామాల్లో నదీపాతం తీవ్రంగా ఉంది. గోదావరి కోత రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. కోట్లాది రూపాయల విలువైన భూములు ఏటా నదీ గర్భంలో కలిసిపోతున్నాయి. రోజురోజుకూ నదీపాతం శృతిమించడంతో రైతులు తీవ్ర వేదనకు గురవుతున్నారు. ఇటీవల వచ్చిన వరదలకు గోదావరి కోత మరింత తీవ్రమైంది. మండలంలోని పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, బాడిలంక, ఆదుర్రు గ్రామాల్లో కోత ప్రభావం తీవ్రంగా ఉంది. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు తదితర గ్రామాల్లో కోత ప్రభావం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. కోత నివారణకు రివిట్‌మెంట్ల నిర్మాణంతో పాటు, గ్రోయన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు.

కనుమరుగవుతున్న గ్రోయన్లు

గోదావరి నీటి ప్రవాహాన్ని మళ్లించి, తద్వారా కోతను నివారించేందుకు గతంలో నిర్మించిన గ్రోయన్లు, రివిట్‌మెంట్లు నదిలోకి జారిపోతున్నాయి. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు తదితర గ్రామాల్లో ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది. ఆయా గ్రామాల్లో కొన్ని చోట్ల గ్రోయన్లు, రివిట్‌మెంట్లు కనుమరుగయ్యాయి. మరికొన్ని చోట్ల గ్రోయన్లు పాడైపోవడంతో నదీపాతం మరింత ఎక్కువైందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పాడైపోయిన గ్రోయన్లు, రివిట్‌మెంట్ల మరమ్మతులకైనా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ దిశగా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యాచరణ చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై హెడ్‌వర్క్స్ ఏఈఈ టీవీఎల్ఎన్ మూర్తిని వివరణ కోరగా, గ్రోయన్లతో పాటు పిచ్చింగ్ రివిట్‌మెంట్ నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని చెప్పారు.



పెదపట్నంలంకలో కూరుకుపోతున్న గోదావరి రివిట్‌మెంట్

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

రావులపాలెం: ఇటీవల అమలాపురంలో జరిగిన డిగ్రీ విద్యార్థుల యూత్ ఫెస్టివల్(2023-2024,) డిస్టిక్ ఎయిడ్స్ ప్రివెన్షన్, కంట్రోల్ యూనిట్ కోనసీమ జిల్లా స్థాయిలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో స్థానిక డిగ్రీ కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సర బీఎస్సీ విద్యార్థులు రెండు విభాగాల్లో బహుమతులు గెలుచుకున్నారు. వీరిని బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణ, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. డ్రామా, రీల్ మేకింగ్ విభాగాల్లో ప్రథమ బహుమతులను గెలుచుకోవడం ద్వారా డ్రామా విభాగానికి రూ.10 వేలు, రీల్ మేకింగ్ విభాగానికి రూ.5 వేలు బహుమతి ఇచ్చినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను కళాశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ రమేష్‌బాబు, సీనియర్ అధ్యాపకుడు బీహెచ్ ఎస్ఎస్‌పీ మూర్తి, బీపీఎస్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్, సుభాషిణి, హరిబాబు, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాంచి పోస్టాఫీసు ప్రారంభం



బెల్లంపూడిలో పోస్టాఫీస్ ప్రారంభించిన సర్పంచ్ మహాలక్ష్మి

పి.గన్నవరం: పోస్టాఫీసు ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజోలు పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ జె.వేణు అన్నారు. బెల్లంపూడిలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రాంచి పోస్టాఫీసును సర్పంచ్ బండి మహాలక్ష్మి బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ అధ్యక్షతన జరిగిన సభలో వేణు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ పోస్టాఫీసుల ద్వారా సుమారు 40 రకాల సేవలు అందిస్తున్నామని వివరించారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పోస్టాఫీసు పనిచేస్తుందని ఆయన వివరించారు. బ్రాంచి పోస్ట్ మాస్టర్ పప్పొప్పుల షారోన్‌కుమారి, ఎంటలు సూర్యనారాయణ, నాగేశ్వరరావు, అసిస్టెంట్ బ్రాంచి పోస్ట్ మాస్టర్ కె.ప్రసాద్, నాయకులు బండి రమేష్, పసుపులేటి వెంకటేశ్వరరావు, వై.రవీంద్ర గోపాల్, పి.స్వామి, పి.వల్లపురాజు, బండి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమ' ఘనత జగన్ ప్రభుత్వానిదే..

కొత్తపేట: రాష్ట్రంలో నాయకుల సిఫారసులకు, అవినీతి, అక్రమాలకు అవకాశం లేకుండా ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ఈ దేశంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం-4 వద్ద బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. సభకు పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు అధ్యక్షత వహించగా అముడా చైర్మన్, ఎంపీపీ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సభలో వారు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం, ఆర్థిక ప్రగతి కోసం ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని వినూత్నమైన పథకాలను నాలుగున్నరేళ్లుగా ఈ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. అందుకు వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్, మన ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిలను గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ బడేమియా, మండల మహిళా విభాగం కన్వీనర్ పోతుల చంద్రావతి, బూత్ కన్వీనర్లు, గృహ సారథులు సుతాపల్లి నానారావు, షేక్ ఖాజాబాబు, ఎంపీడీఓ ఈ మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కేశనపల్లిలో పార్టీ జెండా ఎగరవేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

మోరిలో..

సఖినేటిపల్లి: మండలంలోని మోరి పంచాయతీ వద్ద బుధవారం ఇన్‌చార్జ్ ఎంపీడీవో బడుగు మంగాదేవి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం జరిగింది. ఎంపీపీ వీరా మల్లిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విప్లవాత్మక నిర్ణయాలతో పాలన సీఎం జగన్ పాలన చేస్తున్నారన్నారు. గ్రామ శివారు లింగమ్మచెరువు వద్ద వైఎస్సార్ సీపీ జెండాను పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ ఆవిష్కరించారు. తొలుత పంచాయతీ వద్ద సంక్షేమ పథకాల బోర్డుతో పాటు, మొత్తం సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య, పంపిణీ చేసిన మొత్తం హైలెట్ చేస్తూ డిస్‌ప్లే బోర్డును సర్పంచ్ పసలపూడి లక్ష్మీ పద్మ మంగతాయారు, ఎంపీపీ ఆవిష్కరించారు. ఎంపీటీసీ జాన లక్ష్మీదుర్గ సూర్యావతి, పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ పెదపాటి నాగలక్ష్మి, పార్టీ చేనేత విభాగం ప్రతినిధి జాన శంకరరావు, గ్రామ అధ్యక్షుడు చెల్లుబోయిన రాంబాబు, సచివాలయ కన్వీనర్ చెల్లుబోయిన రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



కొత్తపేటలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న అముడా చైర్మన్ డేవిడ్‌రాజు

కేశనపల్లిలో..

మలికిపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మాజీరావు పేర్కొన్నారు. కేశనపల్లిలో గురువారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో పార్టీ జెండావిష్కరణ చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం జగన్‌ను వచ్చే ఎన్నికల్లో కూడా గెలిపించుకోవాలని ఆయన సూచించారు. సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణస్వామి, ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ, ఎంపీడీఓ ముత్యం వీరాస్వామి నాయుడు, యర్రంశెట్టి కృష్ణ, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సుంకర బాల్జి, చింతా రాజబాబు, నల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాజవరంలో సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న శ్రీధర్ తదితరులు

రాజవరంలో..

ఆత్రేయపురం: సీఎం జగన్ ప్రభుత్వంలో అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జగనే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం మండలంలోని రాజవరంలో నిర్వహించారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. గ్రామంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నవాబుపేటలో..

ఆలమూరు: రాష్ట్రంలోని పేద బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండేందుకు అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలు కొనసాగించాలంటే రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపించుకోవలసిన అవసరం ఉందని ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం జరిగింది. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, గృహసారథులు తదితరులు వలంటీర్లతో కలసి గ్రామంలో పర్యటించారు. గత నాలుగేన్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని జాబితా రూపంలో వివరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రజలకు వివరించారు. సర్పంచ్ సూరంపూడి ముత్యాలమ్మ, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, కార్యదర్శి జె.అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



కొత్తపేటలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో ముక్కంటి

కొత్తపేట: సమాజంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీఓ ఎం.ముక్కంటి సూచించారు. బుధవారం స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తహసీల్దార్ జీడీ కిశోర్‌బాబు, కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి అధ్యక్షతన ఓటు హక్కుపై అవగాహన, ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో ముక్కంటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశాల్లో ఓటుకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ఓటు విలువను అర్థం చేసుకుని, ఆ ఓటు హక్కును సక్రమంగా వినియోగించడం ద్వారా మంచి ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాలన్నారు. ఓటును వేస్తే మనకేంటి? వేయకపోతే ఏమవుతుందిలే.. అని ఆలోచించకుండా సమాజాభివృద్ధికి, తద్వారా దేశాభివృద్ధికి పాటుపడే నీతి, నిజాయితీ కలిగిన ప్రజా ప్రతినిధిని ఎన్నుకోవడానికి ఓటు కలిగిన వారందరూ విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి పౌరుడు ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డీసీఎస్ పాపారావు, డాక్టర్ ఎస్.అంకమరావు, వి.నాగదీపిక, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆప్యాయంగా పలకరిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ..

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- చొప్పెల్లలో రెండో రోజు గడప గడపకూ..



చొప్పెల్లలో వృద్ధురాలిని పలకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి పారదర్శకత, అర్హతలే ప్రామాణికంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధిని వివరిస్తూ ప్రజలందరినీ ఆప్యాయతతో పలకరిస్తూ, గ్రామస్తులు లేవనెత్తిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం 200వ రోజుకు చేరుకుంది. అలుపెరగని లక్ష్యంతో ప్రజా సమస్యల పరిష్కారంగా, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించాలన్న దృక్పథంతో నిర్వహిస్తున్న ఈ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని చొప్పెల్లలో రెండో విడత జరిగింది. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, సర్పంచ్ దంగేటి చంద్రకళ, గ్రామ కమిటీ అధ్యక్షుడు వాసన రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి అపూర్వ స్పందన లభించింది. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలతో పాటు అదనంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల కుటుంబాలకు కలిగిన లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని జగ్గిరెడ్డి ఈసందర్భంగా గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం నియోజకవర్గంలో 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఉప సర్పంచ్ తోరాటి దుర్గారావు, మాజీ ఉప సర్పంచ్ సుంకర కామరాజు, దియ్యన పెదకాపు, జాంప్రోలు అబ్బు తదితరులు పాల్గొన్నారు..

ఎమ్మెల్యే కుమారుడి నిశ్చితార్థంలో ప్రముఖులు



వికాస్‌ను అభినందిస్తున్న ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారెడ్డి, మంత్రి నాగార్జున

మామిడికుదురు: పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తనయుడు కొండేటి వికాస్‌బాబు నిశ్చితార్థం బుధవారం గుంటూరులో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర మంత్రులు మేరుగ నాగార్జున, పినిపే విశ్వరూప్, ఎంపీ నందిగం సురేష్, శాసనమండలి చైర్మన్ కొయ్యె మోషేన్‌రాజు, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ తదితర ప్రముఖులు వికాస్‌బాబు జంటను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

హెల్త్ సూపర్‌వైజర్లకు సత్కారం

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్లుగా పనిచేసి ఎంపీహెచ్ఈఓగా పదోన్నతిపై దేవీపట్నం వెళ్లిన ఎస్.వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం అర్బన్‌కు బదిలీపై వెళ్లిన సీహెచ్ బేబికి బుధవారం ఘన సత్కారం జరిగింది. మండలంలోని బడుగువానిలంకలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది వారిద్దరికీ పూలమాలలు వేసి దుశ్శాలువ వేసి సత్కరించి మెమెంటో బహూకరించారు. విధి నిర్వహణలో భాగంగా పీహెచ్‌సీకి అందించిన సేవలను ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈ బి.సూర్యనారాయణ కొనియాడారు. సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

జిల్లా ఖోఖో జట్టుకు విద్యార్థుల ఎంపిక



చందు



లావణ్యశ్రీ

అంబాజీపేట: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఖోఖో జట్టుకు తొండవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం పీవీ కేశవాచార్యులు, పీడీ పెచ్చెట్టి సూర్యనారాయణలు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఖోఖో క్రీడాకారులను పలువురు బుధవారం అభినందించారు. వీరు మాట్లాడుతూ ఈ నెల 28న గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగిన 33వ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించిందన్నారు. ఈ పోటీల్లో ముత్తాబత్తుల చందు, సవరపు లావణ్యశ్రీలు అత్యంత ప్రతిభ కనబర్చడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టులో స్థానం పొందారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షిప్తంగా..

టీసీబీ ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకోవాలి

రావులపాలెం: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు హెచ్‌సీఎల్ టీచ్‌బీ ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపాలకృష్ణ బుధవారం తెలిపారు. ప్రస్తుతం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులందరికీ ఉద్యోగం అవకాశంతో పాటుగా ఉన్నత చదువులు అభ్యసించడానికి హెచ్‌సీఎల్ ఒక గొప్ప అవకాశం కల్పించిందన్నారు. ఈ ప్రోగ్రాంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులందరూ హెచ్‌సీఎల్ టీచ్‌బీ ప్రోగ్రాంకు ఈ నెల 30 తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకుని డిసెంబర్ 15న ఉదయం 10.30 నుంచి 11.30 గంటల సమయంలో ఆన్‌లైన్ క్యాట్ టెస్టులో పాల్గొనాలన్నారు.

కోతలకు యంత్రాలను వినియోగించాలి

అంబాజీపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను కారణంగా వరి కోతలకు యంత్రాలను వినియోగించాలని ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ తెలిపారు. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతులు వరి పంటలను సంరక్షించుకోవాలన్నారు. వరి కోసిన ధాన్యం రాశులను పొలాల్లో కాకుండా మెరక ప్రాంతాల్లో రాశులు పోసుకోవాలన్నారు. ఆ రాశులపై టార్పిలిన్లతో కప్పి సంరక్షించుకోవాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 3016 ఎకరాలకు గాను కేవలం 200 ఎకరాలు మాత్రమే వరి కోతలు పూర్తయ్యాయన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు రిజిస్టర్ చేయించుకోండి

అయినవిల్లి: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంకు క్రీడలపై ఆసక్తి ఉన్న ఔత్సాహికులు రిజిస్టర్ చేయించుకోవాలని ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య కోరారు. 15 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో రిజిస్టర్ చేయించుకోవచ్చన్నారు. ఈ ఆటల పోటీల్లో కబడ్డీ, కోకో, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ ఉంటాయన్నారు. గ్రామ, మండల వారీగా ఈ పోటీలు ఉంటాయన్నారు. విజేతలుగా నిలిచిన వారు జిల్లా, రాష్ట్ర పోటీల్లో ఆడతారన్నారు.

కొబ్బరిలో అంతర పంటలపై అవగాహన

అయినవిల్లి: కొబ్బరిలో అంతర పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జాతీయ ఉపాధి పథకం ఏపీఓ నాగబాబు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొబ్బరిలో బత్తాయి, నిమ్మ, నారింజ, మామిడి, జీడిమామిడి, మునగ సాగు చేయడానికి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు జాతీయ ఉపాధి పథకం నుంచి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతుల వివరాలను సేకరిస్తుందని తెలిపారు.

కనులపండువగా లక్షపత్రి పూజ

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలిలో వేంచేసిన అయప్ప స్వామి ఆలయంలో బుధవారం స్వామివారి లక్షపత్రి పూజ కనులపండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రఘు ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెన్షనర్ల కార్తిక వన సమారాధన

కొత్తపేట: స్థానిక తాలూకా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనం వద్ద పెన్షనర్లు కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకొన్నారు. బుధవారం సంఘ భవనం ప్రాంగణంలో ఉసిరిచెట్టు వద్ద పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి అజ్జరపు వెంకటసుబ్బారావు, పలువురు సభ్యుల ఆధ్వర్యంలో సంఘ కోశాధికారి ఎస్‌వీ రమణమూర్తి, సంయుక్త కార్యదర్శి కోట్ల విజయసారథి దంపతులు తులసీ సమేత లక్ష్మీనారాయణ పూజ, కార్తిక దామోదర పూజ నిర్వహించారు. పలువురు సభ్యులు ఉసిరికాయలతో వత్తులు వెలిగించారు. ప్రసాద వితరణ, అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సబ్ ట్రెజరీ అధికారి ఎస్‌కేవీ విజయసారథి, సంఘ గౌరవాధ్యక్షుడు నల్లా సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులు గుబ్బల బాబూరావు, కుడిపూడి త్రిమూర్తులు, జీవీఎల్ నరసింహం, సంయుక్త కార్యదర్శి పోతుల జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజులపాలెంలో..

పి.గన్నవరం: రాజులపాలెంలో ఎఫ్‌సీఐ మాజీ సభ్యుడు, పార్టీ నాయకుడు ఇందుకూరి నర్సింహరాజు ఆధ్వర్యంలో బుధవారం కార్తిక వనసమారాధన జరిగింది. గ్రామంలోని శ్రీపట్టాభి రామాలయం ఆవరణలో ఉసిరిచెట్టు వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో క్షత్రియ యూత్ నాయకులు పాల్గొన్నారు.